క్లుప్తంగా

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సీపీడీసీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో తమ కళాశాల విద్యార్థినులు 13 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థినులకు నియామకపత్రాలు అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ విజయవాడ కంపెనీలో పని చేసేందుకు 13 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, సీపీడీసీ సభ్యులు గాదె జనార్దనగుప్త, అడబాల వెంకటరమణ, కొమ్ముల మురళీకృష్ణ, డాక్టర్ రమణ, మమత, శైలజ, విజయలక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు సూచించారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్‌వాడక రహిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పట్టణంలో అవగాహనా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కనకారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం కారణంగా వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు భూగర్భ జలాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం రామకృష్ణ, అకడమిక్ అడ్వైజర్ ఆర్‌వీ సుబ్బారావు, అప్పన ఫణి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

నరసాపురం: విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నరసాపురంలో విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు కె.యామిని, కె.నవీన్, వై.సుధీర్ కోరారు. బుధవారం సంఘ నాయకులు పట్టణంలోని పలు విద్యాసంస్థల యజమానులను కలిసి బంద్‌కు సహకరించవలసిందిగా కోరారు. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయని చెప్పారు. విద్యార్థుల తల్లితండ్రులు కూడా బంద్‌కు సహకరించాలని చెప్పారు.

ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన



సిద్ధాంతంలో భారీ క్రేన్‌తో పూలమాల వేస్తున్న అభిమానులు

పెనుగొండ: ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన ఉంటుందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం పెనుగొండ మండలంలో దొంగరావిపాలెం, సిద్ధాంతం, నక్కావారి పాలెం, గుడిపాడు, నడిపూడి, చినమల్లం, ములపర్రు, తాళ్లపాలెం, దేవ, తామరాడ, సోమరాజు చెరువు, కొఠాలపర్రు, మునమర్రు, వడలి, వెంకట్రామపురం గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సిద్ధాంతంలో భారీ క్రేన్‌తో భారీ గజమాల వేశారు.

హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

పెనుగొండ: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆర్‌ఎస్ఎస్ జిల్లా కార్యకారిణి కానూరి అర్జునరావు డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బుధవారం పెనుగొండలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అన్నదమ్ముల్లా కలిసి కట్టుగా ఉంటున్న తరుణంలో రాహుల్ వ్యాఖ్యలు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ అందరినీ ఒకే కంటితో చూస్తుందన్నారు. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్ గాంధీ హిందువుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకుని, క్షమాపణచెప్పకపోతే తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆరోగ్యవంతమైన నారుతో అధిక దిగుబడులు

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు
- గ్రామాల్లో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు



ఎల్బీచర్ల గ్రామంలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు



ఎల్బీచర్లలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం



కొప్పర్రు గ్రామంలో ఏపుగా పెరిగిన నారుమడి

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని రైతులు ప్రస్తుతం రైతులు సార్వా నారు మడులను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నారుమడులు పోయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వ్యవసాయాధికారి రాజశేఖర్ రైతులకు సూచనలు చేస్తున్నారు. నారుమడి వేసేందుకు దమ్ముచేసిన చేలను చదును చేసి నీటిని పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారుమడికి రెండు కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లేముందు మరో కిలో విత్తనం 12–14 రోజులకు) ఒక కిలో బాస్వరం, ఒక కిలో పొటాషియం ఎరువులను దుక్కిలో వేయాలని సూచించారు. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాస్వరం రెట్టింపు మోతాదులో వేయాలని తెలిపారు.

నారు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మొలకెత్తిన విత్తనాలను సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు, ఒక ఆకు పూర్తిగా పురివిప్పుకునే వరకూ తడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు నిలకట్టాలి.
- జింక్ లోపాన్ని గమనిస్తే లీటరుకు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారు తీసే వారం రోజులకు ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రొటాఫాస్(1.6మిల్లీలీటర్లు) లేక క్లోరిపైరిఫాస్(2.0మిలీటర్లు) లీటరు నీటికి కలిపి విత్తనాలు విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి.

పొలం తయారు చేసుకోవడం ఇలా

నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని మురగదమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము, చెక్కతో గానీ, అరటి బోదెలతో గానీ చదును చేయాలి. భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి భూమిలో ఏమైనా సూక్ష్మదాతు లోపాలుంటే మొదటి మూడు దమ్ముల్లోనే ఆలోపాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. జింక్ లోపం ఉంటే మూడవ దమ్ములో ముడిజింక్‌ను వాడటం వల్ల నాటిన తరువాత వచ్చే జింక్ లోప సమస్యను అధిగమించవచ్చు.

నారు తీసే సమయంలో జాగ్రత్తలు

- నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి.
- ముదురు నారును నాటితే దిగుబడి తగ్గుతోంది. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది.
- నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 33 మానులు , రబీలో 44 మానులు ఉండేలా చూడాలి.
- నాటిన తరువాత ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతిని కొంత వరకు అదుపు చేయవచ్చు.
- ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయి.
- వరి రకాల కాలపరిమతిని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించాలి.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి



రోగులను పరిక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు దినేష్ కోరారు. మొగల్తూరు–3 సచివాలయ పరిధిలోని కుక్కలవారితోటలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం ద్వారా రోగులను పరీక్షించడం ద్వారా వెంటనే రోగులకు వైద్య సేవలు అందించవచ్చన్నారు. గ్రామంలోని బాలింతలను, గర్భిణులను లేవలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరిక్షించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన వారితో పాటు గ్రామంలోని రోగులను సుమారు 126 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది దేవిశ్రీ, సావిత్రి, కె.సాంబశివరావు, సంపత్, పైలట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి



పాలకొల్లులో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వారికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉచ్చుల స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన నేతలు అక్రమంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసు కేసులు పెడితే భయపడవద్దని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అర్ధరాత్రి వచ్చినా తాను స్పందిస్తానన్నారు. రాబోయే కాలంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ పార్టీకి కష్టించి పనిచేయాలన్నారు. ఈ నెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ అధికారంలో లేనంత మాత్రాన నిరుత్సాహ పడవద్దన్నారు.

చంద్రబాబు పక్కలో బల్లెం పవన్ కల్యాణ్

చంద్రబాబుని సమర్ధిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ పక్కలో బల్లెం లాంటివాడని, అతని నమ్మవద్దని చేగొండి సూర్యప్రకాష్ చంద్రబాబుకి సలహా ఇచ్చారు. పవన్‌కల్యాణ్‌ను చాలా దగ్గరనుంచి గమనించిన వ్యక్తిగా చెబుతున్నానని, అతని చంద్రబాబుకి ఎప్పటికైనా ప్రమాదమేనన్నారు. భవిష్యత్తులో నారా లోకేష్‌ని సీఎం చేసుకోవాలని చంద్రబాబు కలలు కంటున్నారన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ అధికారంలో ఉండగా పనిచేసిన ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ సబ్బిత సుమంగళి, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పితాని చిన్నా, కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు, వైస్ ఎంపీపీలు యన్నాబత్తుల నాగేశ్వరరావు, గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, బండి సుందరరామమూర్తి, నిమ్మకాయల రామకృష్ణ, పెచ్చెట్టి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను పాలకొల్లులో నిర్వహించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్ సీపీకి మంచి రోజులు రానున్నాయన్నారు. కార్యకర్తలకు కష్టం వస్తే అండగా నిలుస్తామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పార్టీ నాయకులతో కమిటీ వేసి కార్యకర్తలకు కష్టం వస్తే సమష్టిగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు ముచ్చర్ల శ్రీరామ్, డీటీడీసీ బాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్ రాజు, పార్టీ నాయకులు మానుకొండ శ్రీనుబాబు, మద్దా చంద్రకళ, ఖండవల్లి వాసు, కవురు గాంధీ, పొనుకుమట్ల వీరాస్వామి, రావూరి కోటి నాగమురళీకృష్ణ, వైస్‌ఎంపీపీలు యన్నాబత్తుల నాగేశ్వరరావు, పడవల సునీల్‌బాబు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో మేలైన దిగుబడులు



మొగల్తూరులో వేసిన ఆకుమడులు

మొగల్తూరు: సార్వా సాగుకు సంబంధించి ఇప్పటి వరకు ఆకుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. బుధవారం మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం , పాలకమ్మచెరవు తదితర ప్రాంతాలలో ఆకుమడులు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 980 ఎకరాలలో సార్వా సాగు చేపట్టనున్నారని అంచనా వేస్తుండగా సుమారు 50 ఎకరాలలో మాత్రమే ఆకుమడులు వేయడం పూర్తయ్యిందన్నారు. ఆకుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతి పాటించాలని, ఎకరాకు 12 నుండి 15 కేజీల విత్తనాలు సరిపోతాయని ఆకు కూడా బాగా ఎదుగుతుందన్నారు. వరి విత్తనాలు జల్లిన తరువాత ఆకుమడుల్లో నీరు నీలువలేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిలిచిపోయినా లేదా భారీ వర్షాలు కురిసినా తెగుళ్లు సోకకుండా కార్బడిజమ్, మాంకోజబ్ 4 గ్రాములు, లేదా ప్లాంటోమైసిన్ 1 గ్రాము మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒక ఎకరం పొలంలో వరి నాట్లు వేయాలంటే 5 సెంట్లలో వేసిన ఆకుమడి సరిపోతుందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యవంతమైన నారు పెరగాలంటే 1 నుంచి 2 కేజీల పోటాష్ వేస్తే సరిపోతుందన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అల్లూరుకి ఘన నివాళి



పెనుగొండలో అల్లూరు సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధికి విశేష కృషిచేసిన కార్మిక నాయకుడు అల్లూరు సత్యనారాయణ ఆదర్శ ప్రజా నాయకుడు అని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావుకొనియాడారు. అల్లూరు 10వ వర్ధంతి సందర్భంగా పెనుగొండలో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. 1953 నుంచి 94 వరకూ జిల్లా పార్టీ బాధ్యతలు నిర్వహించి, అంకిత భావంతో ఉద్యమాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలోసీపీఎం నాయకులు నీలాపు ఆదినారాయణ, నాగిశెట్టి గంగారావు, శీలం ఏసు, బొల్లోజు నేతాజీ, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవకులు నిబద్ధతతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ డేవిడ్ లివింగ్‌స్టన్

పాలకొల్లు అర్బన్: సమాజంలో దేవుని సేవకులుగా గుర్తింపు పొందిన పాస్టర్లు నిబద్ధతో పనిచేయాలని బిషప్ డేవిడ్ లివింగ్‌స్టన్ సూచించారు. పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బుధవారం సేవకురాలు మరియమ్మ చర్చి ఆవరణలో నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో క్రైస్తవ సమాజంపై జరుగుతున్న దాడుల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాస్టర్లంతా ఐక్యతతో జీవించాలని కోరారు. నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వానికి సమావేశంలో శుభాకాంక్షలు తెలియజేస్తూ పాస్టర్లకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గోబేరు కృపా శ్యాంసన్, గౌరవాధ్యక్షుడు ఐ.సెయింట్‌పాల్, కన్వీనర్ మట్టా జాన్‌మోషే, ఎస్.కిషోర్, గమానియేలు, డి.అశోక్‌కుమార్, ఎస్.నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

జయరాజు కుటుంబానికి పరామర్శ



పెనుమదంలో కుసుమె జయరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుడాల గోపి

పోడూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెనుమదం గ్రామానికి చెందిన కుసుమె జయరాజు భౌతికకాయం వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి గోపితో పాటు డీసీఎంఎల్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ పితాని చిన్నా, సొసైటీ మాజీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్, వడ్లపాటి సురేష్ , పెచ్చెట్టి కృష్ణాజీ తదితరులు జయరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

తొండా శ్రీనివాస్‌కు పరామర్శ

వైఎస్సార్ సీపీ పోడూరు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తొండా శ్రీనివాస్‌కు ఇటీవల గుండె సమస్య రావడంతో స్టంట్‌లు వేయించుకున్నారు. ఈ విషయంలో తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి పార్టీ నాయకులతో కలసి జిన్నూరుపాలెంలో శ్రీనివాస్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆయనకు ధైర్యం చెప్పారు. జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్, స్థానిక నాయకులు కడలి సూర్యచంద్రరావు, చెల్లబోయిన సత్యనారాయణ, పంపన చాణక్యశెట్టి, దుష్యంతుడు, చెన్ను విజయ్, వేంద్ర శ్రీను, శ్రీనివాస్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆర్యవైశ్య ఉపాధ్యక్షుడిపై దాడికి నిరసన

ఉండి: ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కనిగళ్ల బ్రహ్మానందంపై మంగళవారం సాయంత్రం కొందరు యువకులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా బుధవారం సంఘ సభ్యులు ఉండిలో దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. పత్రికా ప్రకటన ద్వారా సంఘ మండలాధ్యక్షుడు బొండాడ కేశవరావు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా నాయకుడు బ్రహ్మానందంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళవారం ఉండిలో మార్కెట్ సమయంలో కొందరు యువకులు మద్యం సేవించి ఆయనపై దాడికి పాల్పడ్డారన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో ఇంటర్వ్యూలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ ఆక్వాకల్చర్ విద్యార్థులకు ప్లేస్మెంట్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఆక్వాకల్చర్ తరపున ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం కౌంట్ 366 కంపెనీ ప్రతినిధులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన ఇంటర్వ్యూలు చేశారు. కౌంట్ 366 కంపెనీ ఆక్వా జెనిక్స్ భీమవరం సీఈఓ సలాది గోపీకృష్ణ ఎంఎస్సీ రెండవ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో జువాల.ఈ అధ్యాపకుడు డాక్టర్ ఎం.రామకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ భద్రాచలం , గెస్ట్ ఫ్యాకల్టీ పి.జ్యోత్స్న, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీసీఎస్ ఎస్సై మృతి

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం సీసీఎస్ ఎస్సైగా పని చేస్తున్న ఎ.నాగేశ్వరరావు మంగళవారం అర్ధరాత్రి విధులు ముగించుకొని కారులో ఇంటికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. విజయవాడకు చెందిన నాగేశ్వరరావు భీమవరం సీసీఎస్‌లో ఎస్సైగా పని చేస్తున్నారు.

తెలుగు భాషకు వెంకటావధాని సేవలు ప్రశంసనీయం



యండగండిలో ఆచార్య వెంకటావధాని జయంతి వేడుకలను నిర్వహిస్తున్న గ్రామ ప్రముఖులు

ఉండి: తెలుగుకు భాష కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ప్రముఖమైన వారిలో ఆచార్య దివాకర్ల వెంకటావధాని ఒకరని, ఆయన సేవలు ప్రశంసనీయమని యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవి కుమార్ అన్నారు. బుధవారం వెంకటావధాని 112వ జయంతి వేడుకలను యండగండిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన శత జయంతి వేడుకల సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలుగు సాహితీ సంపదను ప్రపంచానికి అందించిన మహోన్నత వ్యక్తి వెంకటావధాని అని అన్నారు. ఆయన యండగండి వాసి కావడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేగేశ్న రామరాజు, దామర్తి అప్పారావు, దండు సూర్యనారాయణ రాజు, పేరిచెర్ల సత్యనారాయణరాజు, జర్నలిస్టు బంగార్రావు, కన్నా శివన్నారాయణ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాక్సిన్

ఆకివీడు: ఆవులను రక్షించుకునేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె.జనార్ధన్‌రావు తెలిపారు. మండలంలోని సిద్ధాపురంలో ముద్ద చర్మ వ్యాధి నివారణకు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ఇటీవల ఆవులకు లంపీ స్కిన్ డిసీజ్ (ముద్ద చర్మ వ్యాధి) ఎక్కువగా వస్తుందన్నారు. సకాలంలో వైద్యం అందక, వ్యాధి తీవ్రతతో ఆవులు, దూడలు చనిపోతున్నాయన్నారు. వాటి రక్షణ కోసం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ అందజేస్తున్నామని చెప్పారు. ఈ వ్యాధి రాకుండా 4 నెలల దూడ నుంచి పెద్ద ఆవుల వరకూ టీకాలు వేస్తున్నామన్నారు. నెల పొడవునా ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి వ్యాక్సిన్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పశు సంవర్ధకశాఖ అధికారిణి భార్గవీ సత్య, రైతు నాయకుడు బీహెచ్.తిమ్మరాజు పాల్గొన్నారు.

చురుగ్గా నాలుగులైన్ల రహదారి విస్తరణ

తాడేపల్లిగూడెం: పెంటపాడు శివాలయం నుంచి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన చేపట్టిన నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా మిగిలిన పనులకు నిధులు విడుదలయ్యాయి. వీటిని వినియోగించుకొని కోడేరు నల్లజర్ల రోడ్డులో రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉద్యానవర్సిటీ సమీపంలో తాడిపూడి కాలువపై ఉన్న వంతెనను నాలుగులైన్ల ర హదారి కోసం విస్తరిస్తున్నారు. పాత వంతెన రెయిలింగ్‌ను తొలగించి విస్తరిస్తున్నారు. గూడెం నుంచి నల్లజర్ల వైపునకు కుడి పక్కన వంతెన విస్తరణ ముగిసింది. రెండో వైపు పనులు సాగుతున్నాయి.